ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వందశాతం ఫలితాలు సాధించాలి

పరిగి,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో వందశాతం ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్స్ జేడీ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం జాఫర్‌పల్లి స్కూల్‌ను సందర్శించారు. తరగతి గదులను తిరిగి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడ రికార్డులను పరిశీలించారు. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఫలితాల్లో వందశాతం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున జ్యోత్స్నారాణి

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నారాణి

పరిగి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నారాణి సూచించారు. పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే ఇంటర్ విద్య కీలకమన్నారు. జీవితంలో 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల జీవితకాలాన్ని సుఖవంతంగా గడపవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పేద విద్యార్థులే ఎక్కువగా ఉంటారని, వారి భవిష్యత్తు పట్ల ఆధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వారిని సమాజంలో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు తరగతి గదిలో నిరంతర కృషి జరుగాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకుని, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఇంటర్‌లో ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలను తీసుకవచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. గత పరీక్షల్లో ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 463/470 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన జి.భవానిని అభినందించి, తన తల్లి స్వర్గీయ ఎల్.లక్ష్మీబాయి స్మారకార్థ వెండి పథకాన్ని అందజేశారు. సీఈసీ కళాశాల టాపర్‌గా నిలిచిన విజయ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి శంకర్, ఇంటర్ మెడికల్ బోర్డు డీడీ విద్యులత, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, డాక్టర్ భాస్కరయోగి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులు సిద్ధం



ముస్తాబవుతున్న మండపాలు

కొలువుదీరేందుకు తరలుతున్న విగ్రహాలు

వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ

7



తెలంగాణ ఊటీగా పిలుచుకునే అనంతగిరి.. ఆహ్లాదకరమైన ప్రకృతి, ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. ఇక్కడ పక్షుల కిలకిలా రావాలు, మయూరాల నృత్యాలు, జింక పిల్లల పరుగులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో పర్యాటకుల అవసరమైన వసతులు కల్పించేందుకు అటవీ అభివృద్ధి సంస్థ ముందుకు వచ్చింది. ఈ కొండల్లో బస ఏర్పాటుతో పాటు సఫారీ రైడ్ ద్వారా వారికి ఒక మధురమైన జ్ఞాపకాలను మిగిల్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.



ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు(ఫైల్)

Sunday Special

పర్యాటకులకు పరవశమే

'అనంతగిరి'లో సఫారీ రైడ్, ట్రెక్కింగ్





రాత్రంతా అడవిలో గడిపేందుకు కాటేజీలు

స్పెషల్ ప్యాకేజీలు సిద్ధం చేసిన అధికారులు

రూ. 45లక్షలతో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

త్వరలో ప్రారంభానికి అధికారుల కసరత్తు

వికారాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే శని, ఆది వారాలు వస్తే చాలు అనంతగిరికి వేల సంఖ్యలో పర్యాటకులు క్యూ కడుతుంటారు. అయితే ఇక్కడ రాత్రి వేళ బస చేసేందుకు అనువైన స్థలం లేకపోవడంతో కాస్త ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అటవీ అభివృద్ధి సంస్థ(ఎఫ్‌డీసీ) పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తూ అడవిలో అర్ధరాత్రి ఆనందంగా గడిపేందుకు రూ.45 లక్షల నిధులతో కాటేజీలను సిద్ధం చేసింది. ఆ కాటేజీలకి 'ది బ్రీజ్' గా నామకరణం చేసింది. ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ఆవరణలో నాలుగు కాటేజీలను సిద్ధం చేశారు. అందులో 15గంటల వరకు

మిగతా 7వ పేజీలో...



అనంతగిరి అటవీ ప్రాంతం

రాత్రంతా అడవిలో..

ఈ కాటేజీల్లో ఉండేందుకు పర్యాటకులు మధ్యాహ్నమే అక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. వచ్చిన వారికి వెంటనే స్నాక్స్ అందించి రాత్రికి డిన్నర్ అందిస్తారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తో ప్యాకేజీ ముగుస్తుంది. ఆ సమయంలోనే పర్యాటకులకు క్షణక్షణం ఏం అందించాలి? ఏ ప్రదేశాలు చూపించాలి? ఎలాంటి యాక్టివిటిస్ చేయాలని ఒక ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్యాకేజీలో ఒక్కో గదిలో ఒకరు నుంచి ముగ్గురు చొప్పున ఉండే విధంగా చూస్తున్నారు. ఇందులో మనుషుల సంఖ్యను బట్టి రూ.5 వేలు, రూ.3,800, అదనంగా ఉంటే మరో రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది.



ద బ్రీజ్ గెస్ట్ హౌస్

త్వరలోనే అందుబాటులోకి..



అనంతగిరిలో పైలెట్ ప్రాజెక్టుగా రూ.45 లక్షల నిధులతో కాటేజీలను ఏర్పాటు చేశాం. ఇక్కడ పర్యాటకులకు ప్యాకేజీలో భాగంగా రాత్రి బస సౌకర్యాలు కల్పించి భోజనం, సఫారీ రైడ్‌ను అందిస్తాం. భవిష్యత్తులో అనంతగిరిలో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. త్వరలోనే ఈ ప్యాకేజీలను ప్రారంభించనున్నాం.

- శ్రీనివాస్‌రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



సఫారీ రైడ్‌కు సిద్ధంగా ఉన్న జీప్



గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కాటేజీలు

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి.. శామీర్‌పేట పెద్ద చెరువు పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మను చౌదరి అధికారులు ఆదేశించారు. ఆయన శనివారం శామీర్‌పేట పెద్ద చెరువును అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీసీపీ కోటిరెడ్డితో కలిసి సందర్శించారు. అక్కడ నిమజ్జనం ఘాట్‌లను, క్రేన్‌లను ఏర్పాటు చేసే స్థలం, మెడికల్ క్యాంప్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాట్లపై అధికారుల, సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు వద్దకు వచ్చే భక్తులకు సరిపడా మొబైల్ టాయిలెట్‌లు, అలాగే నాలుగు క్రేన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే భక్తులు చెరువు దగ్గరికి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. చెరువు పరిసరాల్లో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నీటి మట్టం ఎక్కువగా ఉన్న మధ్య భాగంలో నిమజ్జనానికి తగు ఏర్పాట్లను చేయాలన్నారు. గఆర్‌అండ్‌బీ, పోలీసు, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జన పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి రాజీవ్‌కుమార్‌సింగ్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, తదితర అధికారులు పాల్గొన్నారు.



అన్నాభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఘనంగా అన్నాభిషేకం

కీసర గుట్టలో ముగిసిన శ్రావణ మాసోత్సవం

కీసర, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు ఉత్సవంలో భాగంగా శనివారం అమావాస్య సందర్భంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు అభిషేకాలు, అర్చనలకు అనుమతించారు. అనంతరం ఆలయ చైర్మన్, ఫౌండర్ సభ్యులు కలిసి మహా శివునికి తైలాభిషేకం, వరి అన్నంతో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా వితరణ చేసి, ఆలయ ద్వార బంధనం చేశారు. శ్రావణ మాసం చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేయడంతో కీసరగుట్టపై సందడి నెలకొంది.

చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

కులకచర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చెంచు కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం మండలంలోని సాల్విడ్ గ్రామంలో సయోధ్య ఓం ఫర్ ఉమెన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏకమ్ బస్తార్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన విస్తరాకుల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచు కుటుంబాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. పక్కా భవనాల్లో ఉండాలని ప్రభుత్వాలతో పాటు తన కోరిక అన్నారు. ప్రభుత్వాల పరంగా ఏ సంక్షేమ పథకం అమలైనా చెంచులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలను చదివించి ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని సూచించారు. స్థానిక పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలతో చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మృదుల, కో ఆర్డినేటర్ శివాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఏపీడీ నర్సిములు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంతోష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

శనైశ్వరాలయం కిటకిట



మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో శనైశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం శనివారం అమావాస్య కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు కరణ రామ్‌దిలీప్‌కుమార్ భక్తులతో అభిషేకాలు చేయించారు. చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు కర్ణాటక, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

-మోమిన్‌పేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి)

కుళ్లిన ఉల్లి.. మొలకెత్తిన పెసర

భారీ వర్షాలకు ఆగమైన పంటలు

నీటిపాలైన వేల ఎకరాలు.. ఆందోళనలో రైతులు



మర్పల్లి: కుళ్లిపోయిన ఉల్లిగడ్డలను ఆరబెడుతున్న రైతు

తాండూరు/పెద్దేముల్/మర్పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. నేటికీ వరద నీరు పంట పొలాల్లో నుంచి బయటకు వెళ్లకపోవడంతో పత్తి, పెసర, ఉల్లి పంటలు కుళ్లిపోయాయి. పెసర కాయల్లో గింజలు మొలకెత్తగా, ఉల్లి పూర్తిగా తడిసిముద్దయింది. తాండూరు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 700 ఎకరాల వరకు వివిధ పంటలు ముంపునకు గురైనట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రధానంగా 250 ఎకరాల్లో కంది, 150 ఎకరాల పత్తి , 250 ఎకరాల పెసర, 100 ఎకరాల మినుముతో పాటు సోయాబిన్, తదితర పంటలు ఉన్నాయి. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం పైన అంచనాలు వేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుగా ఎక్కువ పంటలు నష్టపోయిన గ్రామాలను ఎంపిక చేసుకున్నారు. త్వరలో నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని వ్యవసాయ శాఖ ఏడీ కొమరయ్య చెప్పారు. అలాగే పెద్దేముల్ మండలంలో



తాండూరు: సంగెంకలాన్‌లో నీటమునిగిన పెసర పంట

పత్తి పంటల్లో నీరుచేరి దెబ్బతిన్నా సస్యరక్షణ చర్యలతో మెరుగుపడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కానీ చేతి కొచ్చే దశలో ఉన్న పెసరపంట మాత్రం 250 ఎకరాల్లో

మిగతా 8వ పేజీలో...

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సత్యసాయి శత వారికోత్సవ వేడుకల్లో భాగంగా బాల వికాస్ కార్యక్రమాన్ని శనివారం మండల పరిధి కౌకుంట్ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడలు, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, అంగన్వాడీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సమితి దశాబ్దాలుగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతరులకు స్ఫూర్తిమంతంగా నిలుస్తోందన్నారు. ఇది గొప్ప విషయం అన్నారు. ప్రజలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి మండల కన్వీనర్ రామాగౌడ్, సభ్యులు గోపాలచారి, మాణిక్యరెడ్డి, పెంటారెడ్డి, సతీశ్, శివరాం, శ్రీనివాస్‌గౌడ్, భజన మండలి, యువకులు, టీచర్లు ఉన్నారు.


కౌకుంట్లలో సత్యసాయి సేవా సమితి సభ్యులతో కృష్ణారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వానకాలం సీజన్ ధాన్యం సేకరణకు వడ్ల కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. వరి ధాన్యం సేకరణ ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా సేకరించాలన్నారు. జిల్లాలో దొడ్డు వడ్లు 31,200 టన్నులు, సన్నరకం 73,800 టన్నుల సేకరణకు అంచనా వేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూనిక, తూర్పారబెట్టే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని, తగినన్ని సంచులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రాజరత్నం, డీసీఎస్‌వో సుదర్శన్, డీఎంసీఎస్ మోహనకృష్ణ, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీవో నాగార్జున, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మీ సేవ సెంటర్ల నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే చర్యలు

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ తీసుకుంటే వారి లైసెన్స్ రద్దు చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మీసేవ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మీ సేవ కేంద్రాల్లో ఇచ్చే రసీదులో ఉండే రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, నిజమని తేలితే మీ సేవ కేంద్రం గుర్తింపును రద్దు చేస్తామన్నారు. అన్ని పని దినాల్లో కేంద్రాలను తెరవాలని సూచించారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల, కల్యాణలక్ష్మి దరఖాస్తులకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము మాత్రమే తీసుకోవాలని ఆదేశించారు. మీ సేవ కేంద్రానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని తెలిపారు. అనుమతిపొందిన చోటనే కేంద్రాన్ని నిర్వహించాలన్నారు. రుసుం పట్టికలను పెద్ద బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. అధిక రుసుము వసూలు చేస్తే ప్రజలు 1100కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మేనేజర్ మహమూద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బోడ వంశీ, ఏర్పుల తరంగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు రూ8,150కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని ఆదే కోవలో కాంగ్రెస్ ప్రభుత్వంకూడా ఈ నిధులను విడుదల చేయకుండా విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు క్లాసులు నడపకుండా, పరీక్షల నిర్వహణలో ఆలస్యం చేసిన ఘటనలున్నాయని తెలిపారు. అంతేగాక కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో పైచదువులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, జస్వంత్, వినయ్, ప్రదీప్, కిషోర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయకపోతే ఉద్యమం

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేశ్ ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షను శనివారం ఆయన సందర్శించారు. దీక్షల్లో కూర్చున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఆమనగల్లులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 24ఏళ్లు గడిచినా సొంత భవనం నిర్మించకపోవడం సరికాదన్నారు. భూ వివాదాన్ని పరిష్కరించి నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాజు, మల్లేశ్, శంకర్, గణేశ్, కురుమయ్య, శివశంకర్ ఉన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

ఆదిభట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చింతపల్లిగూడలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కమిషనర్ బాలకృష్ణకు శనివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చింతపల్లిగూడలో ప్రభుత్వ స్థలాన్ని జోగు స్వామి ఆక్రమించాడని తెలిపారు. అదే స్థలంలో వాటర్ ట్యాంక్, హైమాస్ట్ లైట్లు, వినాయక మండపం ఉండేవన్నారు. వీటన్నింటినీ స్వామి కూల్చివేసి స్థలంలో మరమ్మతులు చేస్తున్నాడని తెలిపారు. కాగా స్వామి రికార్డుల్లో తనకున్న స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించాడని కమిషనర్ తెలిపారు. అధికారులు స్థలాన్ని కాపాడి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జోగు సంజీవ, గణేష్, శేఖర్, బాలయ్య, ఇబ్రహీం, మల్లయ్య, భాస్కర్‌రెడ్డి, మైసయ్య, రమేష్, యాదయ్య, నర్సింహ, స్వామి ఉన్నారు.


ఫిర్యాదు చేస్తున్న చింతపల్లిగూడ వాసులు

దేవర చెరువుకు మరమ్మతులు

కడ్తాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడ్తాల్‌లోని దేవర చెరువుకు మరమ్మతులు చేసినట్టు పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జహంగీర్ అలీ శనివారం తెలిపారు. పనులను ఇరిగేషన్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి, కార్యదర్శి అల్లాజీ, రైతులతో కలిసి పరిశీలించారు. ఇటీవలి వర్షాలకు చెరువుకట్ట కుంగి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ నిర్వాహకుల సహకారంతో పనులను చేపట్టినట్లు తెలిపారు. చేగూరి రాములు, లక్ష్మణ్‌రావు, సర్వేయర్ అలీ, జంగయ్య, రాజు, చింటు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

మొయినాబాద్/షాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ పరిధి సురంగల్ వార్డులో కట్టమైసమ్మ ఆలయం వద్ద భాస్కర్ ఆసుపత్రి వైద్యులు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు కంటి, దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. 150మందికి పరీక్షలు చేసినట్లు వైద్యురాలు క్రాంతి తెలిపారు. షాబాద్ మండలం కుమ్మరిగూడలో పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వైద్యశిబిరాన్ని నిర్వహించింది. మాజీ సర్పంచ్ కేతనరమేశ్ మాట్లాడుతూ.. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని



రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ కూల్చివేత

ఆదిభట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పరిధి శ్రీ అంజలి వెంచరకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డుగా ఉన్న ప్రి కాస్ట్ వాల్‌ను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. హైడ్రా సీఐ తిరుమలేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పగుడి సమీపంలో ఉన్న శ్రీ అంజలి వెంచర్‌కు ఉన్న రోడ్డును స్థానికులు ఆక్రమించి ప్రికాస్ట్ వేశారు. ప్లాట్ల యాజమానులు ఫిర్యాదుతో జేసీబీతో కూల్చేశామని చెప్పారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కులకచర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పరిగి తాలూకా జోనల్ స్థాయి అండర్-14, 17 బాలబాలికల వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14 బాలుర విభాగంలో పరిగి సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు, అండర్-17 విభాగంలో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ బాలురు నిలిచారు. అండర్-14 బాలికల విభాగంలో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్, అండర్-17 విభాగంలో సాల్విడ్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిలిచారు.

కలెక్టరేట్‌లోకి కుక్కలు


కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో లోపలికి వెళుతున్న కుక్క



కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కార్యాలయం వద్ద సంచరిస్తున్న కుక్క

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్‌లో ఎక్కడ చూసినా కనిపించే వీధి కుక్కలు ఏకంగా కలెక్టరేట్‌లోకి ప్రవేశించడం చర్చనీయాంశమైంది. శనివారం ఓ కుక్క మెట్ల మార్గంలో మొదటి అంతస్తులో కార్యాలయాల వద్దకు వెళ్లడం అందరినీ విస్తుపోయేలా చేసింది. కలెక్టరేట్‌లో కుక్కలు తిరుగుతున్నా సిబ్బంది పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పరిగి, కొడంగల్, మన్నేగూడలో కుక్కలు దాడిచేసి పలువురిని గాయపరిచిన ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో కుక్కలు కలెక్టరేట్‌లో తిరగడం పట్ల సందర్శకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని, విచారణలో నాణ్యతను పెంచి నిందితులకు త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై చైతన్యం కల్పించాలన్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డీజేలను నిషేధించామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి


శాంతి భద్రతలకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శనివారం వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో తొక్కిసలాటలు జరుగకుండా వలంటీర్లను నియమించుకోవాలని తెలిపారు. సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు


విశ్వశాంతి చండీ హోమంలో భక్తులు

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో శనివారం ప్రథమ వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, డీసీపీ రాజేశ్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎస్‌ఐలు వెంకటేశ్, వరప్రసాద్ హాజరయ్యారు.సాయంత్రం వరకు పూజలు, హోమాలు, అభిషేకాలు కొనసాగాయి. గాయత్రీదేవి ఉపాసకురాలు శాంకరి అఘోరి మాత ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ విశ్వశాంతి హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎండుమిర్చితో హోమం చేశారు. కడ్తాల సీఐ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, లలితవెంకటయ్య, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, నాయకులు విజయ్‌కృష్ణ, శ్రీకాంత్‌సింగ్, వెంకటయ్య, రాజు, యాదయ్య, మహేశ్, అంజయ్య, సాయి, జగన్, కృష్ణనాయక్, వెంకటయ్య, రూపం వెంకట్‌రెడ్డి, సైదులు, మల్లేశ్, శశికుమార్, బలామణి, మానస, మంగమ్మ, పద్మ, ఉమాభారతి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

గోపులారంలో పశువైద్య శిబిరం


మందులను అందజేస్తున్న పశుసంవర్థక శాఖ అధికారి మధుసూదన్

శంకర్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. గోపులారంలో శనివారం సత్యసాయి సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో యనిమల్ హెల్త్-ఫెర్టిలిటీ క్యాంప్‌ను నిర్వహించారు. పశువులకు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి అవసరమైన సమయాల్లో చికత్సలు చేయించాలని వైద్యులు సూచించారు. 105 పశువులకు గర్భకోశ, పాల దిగుబడికి సంబంధించిన వ్యాధులకు చికిత్స చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మహరాజ్‌పేట్, శంకర్‌పల్లి పశువైద్యాధికారులు శ్రావణిగౌడ్, మానసరెడ్డి. రైతులు శేఖర్, శేషానంద్, సంజీవ, రాజు, కార్తీక్, ఎట్టయ్య, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

బంట్వారం ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ బంట్వారం మండల అధ్యక్షుడు దుర్గంచెరువు మల్లేశం అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు శరణరెడ్డి, ఖాజా పాషా, అంతిరెడ్డి, కలీం పాషా, బల్వంతరెడ్డి, నరేశ్, ఖదీర్ పాల్గొన్నారు.


కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి


రక్తదాతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రక్త, నేత్ర, అవయవ దానాలపై ప్రజల్లో అపోహలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, విద్యావంతులు కృషిచేయాలని కోరారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయకులు, వైద్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. వైద్య సదుపాయాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదల వైద్య చికిత్సలకు రూ.10లక్షల సాయమందిస్తోందని తెలిపారు. కల్వకుర్తిలో వంద పడకలు, ఆమనగల్లులో 30పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కడ్తాలలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలను ఆధునికీకరిస్తామని చెప్పారు. నాయకులు బాలాజీసింగ్, బ్యాంగి ఆనంద్, సంజీవ్‌కుమార్, పర్వతరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శించారు. జైపాల్‌రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం తిరుమలాపూర్‌లో రామచంద్రారెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. రామచంద్రారెడ్డి సతీమణి కౌసల్యమ్మ, వారి కుమారులు యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కూతురు అలివేలమ్మలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సీఎం సోదరుడు కృష్ణారెడ్డి, కేవీఎన్‌రెడ్డి, రఘుమారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, ఆసిఫ్ అలీ,కేశవులు, ఆనంద్, శ్రీను, లక్ష్మయ్య, శశిధర్‌రెడ్డి తదితరులున్నారు.



గణనాథులు సిద్ధం

● మండపాల్లో కొలువుదీరేందుకు తరలుతున్న విగ్రహాలు ● ఉత్సవాలకు అంతా రెడీ


మేడ్చల్‌లో లంబోదరులు

మేడ్చల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వినాయక చవితికి విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 27 నుంచి నవరాత్రుల నుంచి గణనాథుడు పూజలందుకోనున్నాడు. వాడవాడలా గణేశుడిని ప్రతిష్టించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా కళాకారులు గుడారాలు వేసుకొని గణేశుడి విగ్రహాలను తయారు చేసి విక్రయానికి పెట్టారు. అత్వెల్లి సమీపంలో రేకులబావి వద్ద విగ్రహాలను పెద్ద ఎత్తున తయారు చేశారు. అమ్మకాలు జోరుగు కొనసాగుతున్నాయి.

రూ.వందల నుంచి వేలల్లో ధరలు

మేడ్చల్‌కు 50కిలోమీటర్ల దూరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి విగ్రహాలను కొని వాహనాల్లో తీసుకువెళ్తున్నారు. సైజును బట్టి ఒక్కో విగ్రహం ధర రూ.1,500 నుంచి లక్ష రూపాయల వరకు ఉంది. ఈ నెల 27న వినాయక చవితి నేపథ్యంలో మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చి విగ్రహాలను తీసుకుపోతున్నారు. అలాగే హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల కోసం వస్తున్నారు. వివిధ ఆకృతుల్లో వేలాది విగ్రహాలను చేశారు. ఈ ఏడాది ఇప్పటికే వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో పెద్దఎత్తున విగ్రహాలు అమ్మకాలు జరుగుతాయని కళాకారులు, విగ్రహ తయారీదారులు ఆశిస్తున్నారు.


మేడ్చల్‌లో విగ్రహాన్ని తయారు చేస్తున్న కళాకారుడు

మట్టి గణపతులకు జైకొట్టాలి


ఆమనగల్లులో మట్టి వినాయకుల పంపిణీ (ఫైల్)

కాగా పీవోపీతో చేసిన లంబోదరుడి విగ్రహాలు రంగులు, ఇతర రసాయనాలతో పర్యావరణ కాలుష్యానికి కారకమవుతాయి. మట్టి గణపతులే శ్రేష్ఠమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పర్యావరణ హితులు ప్రచారం చేస్తున్నా ప్రజలు 90శాతానికిపైగా రంగు విగ్రహాలనే ప్రతిష్ఠిస్తున్నారు.

ఆమనగల్లు: వాడవాడలా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. ఆమనగల్లులో విగ్రహాలు, పూజాసామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి.

పర్యావరణానికి హాని కలిగించొద్దు



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మట్టి వినాయక విగ్రహాలను నెలకొల్పుకోవాలి. రసాయన రంగుల విగ్రహాలను నెలకొల్పడం హాని చేస్తుంది. భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించేందుకు అందరం బాధ్యతతో మెలగాలి.

- లీలాలక్ష్మారెడ్డి, సీజీఆర్, చైర్‌పర్సన్, ఆమనగల్లు

మట్టి వినాయకులనే పూజించాలి



మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలి. మట్టి విగ్రహాల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు, దాతలు ముందుకు రావాలి. కొన్నేళ్లుగా నేను మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నా. పూజలకు మట్టి ప్రతిమలే శ్రేష్ఠం.

- పాపిశెట్టి రాము, ఆమనగల్లు

పీవోపీ విగ్రహాలతో నీటి వనరులు కలుషితం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకులతో పర్యావరణానికి హాని కలుగుతుంది. విగ్రహాల అలంకరణకు వినియోగించే మెర్క్యురీ, లెడ్, క్యాడ్మియంలతో వాతావరణ కాలుష్యం ఏర్పడుంది. ప్రజలు మట్టి వినాయకులనే పెట్టి పూజించాలి.

- గంగాధర్, సీఐ, కడ్తాల్

ఆకర్షణకు పోతే అసలుకే ముప్పు



రంగులతో రూపుదిద్దుకునే వినాయక విగ్రహాలతో భూమి, నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుంది. మట్టి విగ్రహాలనే పూజించి మార్గదర్శకులు కావాలి. రసాయన రంగులు కళ్లకు, ఆరోగ్యానికి కీడు చేస్తాయి. తాగునీటి వనరుల్లో వినాయకులను నిమజ్జనం చేయొద్దు.

- డాక్టర్ హేమ్‌లాల్, ఆమనగల్లు

కొనుగోలుదారులతో తయారీ కేంద్రాలు కిటకిట ...


తాండూరు-లక్ష్మీనారాయణ్‌పూర్ రోడ్డు పక్కన అమ్మకానికి పెట్టిన వినాయక విగ్రహాలు

బషీరాబాద్ : మండలంలోని తాండూరు-లక్ష్మీనారాయణపూర్ మార్గంలో 10 వరకు తయారు కేంద్రాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో గణనాథులను సిద్ధం చేశారు. రాజస్థాన్ నుంచి వచ్చినకుటుంబాలు గణనాథులను చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ రూ.5వేల నుంచి రూ.35వేల ధర వరకు గణేశ్ విగ్రహాలు ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు గ్రామాల యువకులు వచ్చి గణనాథులను తీసుకువెళ్తున్నారు. చేస్తున్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో 13మంది క్రిస్టియన్ మహిళలకు రూ.20లక్షలు విలువ చేసే కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అల్పసంఖ్యాక మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద క్రిస్టియన్ మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్నామన్నారు. మహిళలు కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఆర్థికంగా ఉండేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళల పేరిట ఇండ్లు, ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీలేని రుణాలను అందజేస్తుందన్నారు. ఈ పథకాలను పేద మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సురవరం మృతికి ఎమ్మెల్యే సంతాపం

సీపీఐ నేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ముద్దు బిడ్డ అయిన సురవరం చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఐలో చేరి అంచెలంచలుగా ఎదిగారని గుర్తుచేశారు. అణగారిన ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సురవరం పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కేశంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పాపిరెడ్డిగూడ తూర్పుగడ్డ తండాకు చెందిన బుజ్జి అనారోగ్యంతో నిమ్స్‌లో చేరింది. ఆమె చికిత్స ఖర్చులపై స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించి ఎల్వోసీని బుజ్జి కుటుంబ సభ్యులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, మాజీ ఉపసర్పంచ్ సుందరయ్య, యాదయ్య, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న నవీన్ మిట్టల్

కీసర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహా మండపంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ వారిని సన్మానించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నవీన్ మిట్టల్ దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ కోరారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలన్నారు, ఆమనగల్లులో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వహణపై సూచనలు చేశారు. మండపాల ఏర్పాటు, నిమజ్జనంపై పోలీసులకు సమాచారం ఇస్తే బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీపీ రాజేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహులు, కడ్తాల్ సీఐ గంగాధర్, ఎస్‌ఐలు ఎస్‌ఐ బి.వెంకటేశ్, సీతారాం, రాంరెడ్డి, ఎంపీడీవో రెహమాన్, కమిషనర్ శంకర్, డాక్టర్ మంజులాదేవి, ఏఈలు తిరుపతయ్య, శంకర్, ఆర్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

చెరువుల వద్ద భద్రత కల్పించాలి

వినాయక విమజ్జనాల నేపథ్యంలో చెరువు, కుంటల వద్ద ప్రమాదాలకు చోటు లేకుండా భద్రతాచర్యలు తీసుకోవాలని డీసీపీ రాజేశ్ అధికారులకు సూచించారు. విద్యుత్ దీపాలను, క్రేన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమనగల్లు సురసముద్రం చెరువును వివిధ శాఖల అధికారులతో ఆయన పరిశీలించారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం

కడ్తాల్: నేర పరిశోధన, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని డీసీపీ రాజేశ్ అన్నారు. మద్దిపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బాలమోని నారాయణగౌడ్ రూ.10వేలు కడ్తాల పీఎస్‌లో సీఐ గంగాధర్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని డీసీపీ కోరారు.

నిబంధనల మేరకు నిర్వహించుకోవాలి

ఇబ్రహీంపట్నం: గణేష్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో అధికారులు, గణేష్ మండలాల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై, విద్యుత్ లైన్ల కింద మండపాలను ఏర్పాటు చేయొద్దన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ఇబ్బందుల్లేకుండా పూజలు నిర్వహించాలన్నారు. విగ్రహాలన్నీ ఒకే రోజు నిమజ్జనం చేసేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, సీఐలు మహేందర్‌రెడ్డి, మధు, నందీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

పర్యాటకులకు పరవశమే


పర్యాటకులు సేదదీరే చోటు

(ఐదో పేజీ తరువాయి)

ఉండే విధంగా ప్యాకేజీలను సిద్ధం చేసింది. ఒక్కొక్క కాటేజీలో వాష్‌రూమ్, టీవీ, బెడ్స్ తదితర విలాసవంతమైన సౌకర్యాలను కల్పించింది. ఆ పక్కనే పర్యాటకులు వంట చేసుకునేలా కిచెన్, డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. గెస్ట్ హౌస్ సమీపంలోనే వాచ్ టవర్ ఉండడంతో అక్కడి నుంచి చూస్తే అనంతగిరి అడవి ప్రాంతంతో పాటు వికారాబాద్ ప్రాంతం పచ్చని చెట్లు, కొండల మధ్య కనిపిస్తూ కనివిందు చేస్తుంది.

అలరించే పక్షి జాతులు..

దట్టమైన అడవిలో పక్షులు, జింకల పరుగులు, నెమళ్ల నృత్యాలను వీక్షించేందుకు సఫారీ రైడ్‌ను సైతం ప్యాకేజీలో అందిస్తున్నారు. ఇందుకోసం ఇక్కడ ప్రత్యేకంగా రెండు జీపులను ఏర్పాటు చేస్తున్న అధికారులు వాటిలో అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యాటకులను తిప్పనున్నారు. అదే విధంగా ఓ గైడ్ సాయంతో పర్యాటకులకు అడవిలో పక్షి జాతుల గురించి వివరిస్తూ.. అక్కడ ఉన్న చెట్ల ప్రాముఖ్యతను వాటి చరిత్రను కూడా వివరించనున్నారు. అలాగే ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటకులు ట్రెక్కింగ్ చేసే విధంగా మొత్తం ఆరు రూట్లు సిద్ధం చేసింది.


అడవిలో సంచరిస్తున్న పందులు (ఫైల్)

ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీల్లోనే అందించాలి


ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు, అంగన్‌వాడీ టీచర్లు

కేశంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్. రాజు డిమాండ్ చేశారు. శనివారం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. 6 సంవత్సరాల లోపు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలతో పాటు పౌష్టికాహారం అందించడానికి 50ఏళ్ల కింద ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల నిర్వీర్యానికి కుట్ర పన్నుతున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కాలంలో విద్యార్థులకు ఆంగ్ల విద్యా అవసరమే అయిన అది అంగన్‌వాడీ వ్యవస్థను దెబ్బతీసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను బోధించడానికి అంగన్‌వాడీ టీచర్లు సిద్ధంగా ఉన్నారని, వారికి అవకాశం ఇచ్చి వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కుళ్లిన ఉల్లి.. మొలకెత్తిన పెసర

(ఐదో పేజీ తరువాయి)


పెద్దేముల్‌లో దెబ్బతిన్న పెసరపంటను అధికారులకు చూపిస్తున్న రైతు

దెబ్బతింది. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చే దశలో నిలువునా మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, కంది పంటల్లో భారీ వర్షాల వల్ల నీరు చేరినా వాటికి పెద్దగా నష్టమేమి జరగలేదు. కాగా, దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తున్నారు.

గోదాంలు ఏర్పాటు చేయాలి

మార్కెట్‌లో ఉల్లిగడ్డ ధర పెరుగుతున్న దశలో పొలాల వద్ద నిల్వ చేసిన పంట వర్షాలకు కుళ్లిపోవడంతో తీరని నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మర్పల్లి మండలంలోని పంచలింగాల, పట్లూర్, మొగిలిగుండ్ల, నర్సాపూర్, మల్లికార్జునగిరి, సిరిపూరం, కొత్లాపూరం తదితర గ్రామాల్లో సుమారు 3,500 ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. వారం రోజుల నుంచి ఉల్లి ధర క్వింటాలు రూ.2వేలు పలకడంతో సంతోషపడ్డారు. కాన, పొలాల వద్ద నిల్వ చేసిన పంట పూర్తిగా కుళ్లిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికైనా ఉల్లి రైతులను దృష్టిలో ఉంచుకొని నిల్వ చేసుకునేందుకు గోదాంలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం


ప్రిన్సిపాల్ బస్వరాజ్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకమని సరస్వతీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బస్వరాజ్ అన్నారు. గౌలికార్‌ఫంక్షన్ హాల్‌లో శనివారం సరస్వతీ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గ్రామాలకు వెళ్లే దారులు బాగుచేయాలి

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి అన్నారు. బీజేపీ వికారాబాద్ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నీటిశుద్ధి కేంద్ర సందర్శనలో విద్యార్థులు

కొడంగల్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నీటి శుద్ధి అంశంపై అవగాహన కల్పించేదుకు ఇండస్ వ్యాలీ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులను కొడంగల్ శివారులోని మిషన్ భగీరత నీటి శుద్ధి కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పైప్‌లైన్ ద్వారా వచ్చిన నీటిశుద్ధి ఎలా జరుగుతుందో వివరించారు.

ఐనెల్లి మోడల్ స్కూల్‌లో కబడ్డీ పోటీలు

తాండూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఐనెల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పెన్నీ గేమ్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో పాము కలకలం


పట్టుకున్న పామును బయట విసిరేస్తున్న యువకుడు

బషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో శనివారం పాము చొరబడటంతో అక్కడి సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. కార్యాలయంలోకి వచ్చిన పామును గమనించిన సిబ్బంది బయటకు పరుగులు తీశారు. గ్యాస్ ఏజెన్సీ యజమాని ఉమామహేశ్వర్‌రావు అప్రమత్తమై స్థానికంగా ఉన్న ప్రదీప్ అనే యువకుడిని పిలిపించగా అతడు పామును పట్టి సుదూర ప్రాంతంలోని పొదాల్లో వదిలిపెట్టాడు.

రుణమాఫీ అయ్యేంతవరకు పోరాటం



సమావేశంలో అభివాదం చేస్తున్న మండల రైతులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ అయ్యేంత వరకు రైతులందరు ఐక్యంగా పోరాటం చేయాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి రైతులను కోరారు. ఎదులాబాద్‌లోని డీఎస్ఆర్ గార్డన్‌లో శనివారం రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర సర్కార్ రుణమాఫీ చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ రామిరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

● శ్రావణమాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు ● భక్తులకు అన్నదానం


వికారాబాద్: రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ముగింపు, శనివారం అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. వికారాబాద్‌లో బుగ్గ రామలింగేశ్వర స్వామిని పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రామయ్యగూడ ఆటోస్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కొడంగల్ రూరల్: పెద్దనందిగామలో హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన పల్లకీసేవ భజన కార్యక్రమాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా పర్సాపూర్, ఎరాన్‌పల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక్య పూజలు నిర్వహించారు.

తాండూరు రూరల్: జినుగుర్తి, మిట్టబాస్పల్లి గ్రామాల్లో గోసంసరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో భజనకీర్తనల మధ్య వాడవాడలో ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన పి.రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవితోపాటు కొందరు కాంగ్రెస్ నాయకులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి శ్రీ రామలింగేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గుండంలో స్నానాలు ఆచించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య పర్యవేక్షించారు.

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాండూరు: రసూల్‌పూర్ హనుమాన్ దేవాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. అదేవిధంగా పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.


తాండూరు రూరల్: జినుగుర్తిలో ఆంజనేయస్వామి పల్లకీసేవలో భక్తులు

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

దేవనూరులో సత్యసాయి బ్రహ్మోత్సవం

యాలాల: దేవనూరులో శనివారం శ్రీసత్యసాయి బ్రహ్మోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సత్యసాయి బాబా శతవార్షికోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు దేశ్‌ముఖ్ కిషన్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో గల పశువైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దేవనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కొత్తగా హెచ్‌ఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంను సన్మానించారు. అనంతరం గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కిరణ్, గ్రామస్తులు ఆశన్న పాల్గొన్నారు. అదేవిధంగా ముసిరి పేటవాడలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాసం ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు అమావాస్య కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రాన్ని అందజేస్తున్న తపస్ నాయకులు

పరిగి,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో శనివారం పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రాన్ని అందజేశారు. తపస్ పరిగి మండల అధ్యక్ష, కార్యదర్శులు మధుసూధన్, కావలి సాయిబాబా, నాయకులు జంగయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధారూరు: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ మేరకు శనివారం సంఘం నాయకులు తహసీల్దార్ సాజిదా బేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ సంఘం నాయకులు రాజు, బాల్‌రాజ్ పాల్గొన్నారు

యాలాల: సీపీఎస్ జీవోను రద్దుచేసి పాత పెన్షన్ వర్తింపజేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని యాలాల మండల తహసీల్దార్‌కు శనివారం తపస్ యాలాల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు జె. చంద్రశేఖర్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో తపస్ ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పెద్దేముల్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం బొంరాస్‌పేట్ మండలంలో మధ్యాహ్న భోజన సమయంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శిరీషకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లయ్య, ఏజాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

విత్తన గణపతిని పూజిద్దాం


విత్తన గణనాథులను పంపిణీ చేస్తున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విత్తన గణపతిని పూజిద్దామని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. పట్టణంలోని యన కార్యాలయంలో శనివారం గ్రీన్ ఇండియా చాలెంజ్ హరిత సేవ వ్యవస్థాపకులు మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన గణపతి పంపిణీ చేశారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ విజయ్‌కుమార్, వీడీడీఎఫ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌తో కలిసి విత్తన విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కిరణ పటేల్, సురేష్ గౌడ్, నాయకులు దత్తు, సురేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ చెరువును పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును శనివారం ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి, ట్రాఫిక్ సీఐ రవీందర్‌లు పరిశీలించారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్, ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్‌కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు సంప్రదించాలి

ధారూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు విద్యుత్ సరఫరా కోసం తమను సంప్రదించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మండలపాల వద్ద ఉత్సవ కమిటీల నిర్వాహకులు సొంతంగా ఎవరూ విద్యుత్ కనెక్షన్‌ను తీసుకోవడానికి ప్రయత్నించొద్దన్నారు. తమ అనుమతి పొందిన తర్వాత స్థానిక లైన్‌మన్ సాయంతో మండపాలకు కనెక్షన్ తీసుకోవాలన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటు


సుధాకర్‌రెడ్డితో విజయలక్ష్మి, జనార్దన్‌రెడ్డి (ఫైల్)

తాండూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి, దేశానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్, సీపీఐ సీనియర్ నాయకులు న్యాయవాది జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఇతర జిల్లాలో ఏఐఎస్ఎఫ్, పార్టీ పోరాటలు చేసినప్పుడు తమ వెన్నంటే ఉండి ధైర్యం చెప్పిన నాయకులని గుర్తుచేసుకున్నారు.

కొడంగల్: అంబేడ్కర్ చౌరస్తాలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పంచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ నాయకుడు సురేశ్‌కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ శనివారం ఘట్‌కేసర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జయచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి రంగాచార్య జయంతి

కొడంగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో దాశరథి రంగాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ టి. రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) తమ కళాశాలలో చదివిన విద్యార్థులు భవిష్యత్తుల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మేడ్చల్ పట్టణ కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ అండ్ మేనేజ్ మేంట్ సైన్స్ కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి అన్నారు. కళాశాలలో వివిధ విభాగాల్లో చదువులు పూర్తి చేసుకున్న 600మంది విద్యార్థులకు శనివారం పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వేముల మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రాడ్యువేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంతటితో తమ చదువును ఆపకుండా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలన్నారు. సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న నూతన విధానాలను తెలుసుకోవటానికి విదేశాల చదువులు ఎంతో దోహదపడుతాయన్నారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు మంచి ప్లేస్‌మెంట్లు పొందుతూ గొప్పస్థాయిలో స్థిరపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పూడూరు: అక్రమ మైనింగ్ కేసులో అరెస్టయిన దోమ మాజీ జడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డిని వికారాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శనివారం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు

సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఘట్‌కేసర్: సిబ్బంది ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ పంజాల రాజేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మున్సిపల్ సిబ్బందికి హెల్త్‌క్యాంప్ ఎర్పాటు చేశారు. కార్యక్రమంలో టీపీవో రాజీవ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

తాండూరు: పట్టణంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ యాదగిరి అన్నారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులతో శనివారం సమీక్షించారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈ ఖాజా ఉన్నారు.

బీఎంపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పరిగి: కామారెడ్డిలో ఈనెల 31న జరిగే బాంసెఫ్ 12వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని భారత్‌ముక్తిమోర్చా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గోవింద్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మహాసభకు సంబంధించి పోస్టర్లను శనివారం పరిగిలో ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దోమ: బాసుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ఎంపీడీవో గ్యమానాయక్ శనివారం పరిశీలించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానం

తాండూరు: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న హిందూ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షురాలిగా ఎన్నికైనందుకు, స్టోన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనే కుంచెం మురళిలను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శనివారం సన్మానించారు.

సీసీఐ కోల్‌మిల్లులో మరమ్మతులు

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ సమీపంలోని ప్రభుత్వరంగ సీసీఐ కర్మాగారంలో అధికారులు మరమ్మతులు చేపట్టారు. వారం రోజుల క్రితం సీసీఐ కర్మాగారాన్ని షడ్‌డౌన్ చేసి కోల్‌మిల్ విభాగంలో బాల్‌వేవింగ్ పనులు చేపడుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు నిర్వహించిన స్టూడెంట్ చాప్టర్‌లో భాగంగా పరిశ్రమలను సందర్శించారు.

బస్టాండ్ ఎదుట డబ్బాల తొలగింపు

కొడంగల్:అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక మున్సిపల్ అధికారులు చౌరస్తాలో బస్టాండ్ ముందు గల డబ్బాలను తొలగించేందుకు శనివారం చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేత

తాండూరు రూరల్: తాండూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పటేల్ ఉమాశంకర్ జన్మదినం సందర్భంగా చంద్రవంచ శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వికారాబాద్: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ పట్టణ ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ న్నారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు షీటీమ్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ బృందం బుచేందర్‌రెడ్డి, రేష్మ, కళాజాత బృందం అశోక్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లీగల్ అవర్నెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి బీ.శ్రీరామ్, న్యాయవాదులు బస్వరాజ్, వెంకటయ్య, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం

మేడ్చల్ టౌన్: పట్టణంలోని పాపారాయ విద్యానికేత్ పాఠశాలలో శనివారం లయన్స్‌క్లబ్, మరియు మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 600మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాశ్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

కొడంగల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్ అన్నారు. సత్యసేవా సమితి తాండూర్, కొడంగల్ భజన మండలి ఆధ్వర్యంలో శనివారం ఉడిమేశ్వరం, అంగడిరైచూర్, దర్మాపూర్, టేకల్‌కోడ్, అన్నారం, పాటిమీదిపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 418మందికి భోజన ప్లేట్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు.

హనుమాన్ ఆలయానికి స్టీల్ ప్లేట్ల వితరణ

శామీర్‌పేట: పూడూరు హనుమాన్ ఆలయానికి శామీర్‌పేటకు చెందిన జర్నలిస్టు మంచాల శేఖర్ 100స్టీల్‌ప్లేట్లు, 50 స్టీలు గ్లాసులను విరాళంగా అందజేశారు.హనుమాన్ ఆలయంలో ప్రతీ అమావాస్యకు నిర్వహించే అన్నదానానికి ప్లేట్లు, గ్లాసులు అందజేసినట్లు శేఖర్ తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

బషీరాబాద్: పాఠశాల వంటగదిలో పరిశుభ్రత పాటించాలని బషీరాబాద్ విద్యాధికారి దూస రాములు సూచించారు. పర్వత్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం నవాల్ల కాంప్లెక్సు జీహెచ్‌ఎం జగదీశ్వర్‌తో కలిసి తనిఖీ చేశారు.

క్రైం కార్నర్

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు


గంజాయితో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేస్తున్న ఎక్సైజ్ సీఐ సదాశివుడు

మోమిన్‌పేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారంతో శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో మోమిన్‌పేట్‌కు చెందిన మొహ్మద్ ఫతేబాబా ఇంటి ఆవరణలో రెండు గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు అతన్ని అరెస్టు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ రేఖ, సిబ్బంది రాజశేఖర్, జ్ఞానేశ్వర్, నర్సింహులు, ఎలీషా, అనిల్, శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 14మేకలు మృత్యువాత

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుక్కలదాడిలో 14మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన ఎన్నెపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తికి చెందిన 20మేకలు ఉన్న షెడ్డు మీద శుక్రవారం అర్ధరాత్రి 1గంటల సమయంలో కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో 14మేకలు మృత్యువాతపడగా, మిగిలిన మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. మృతిచెందిన వాటిని జేసీబీ సాయంతో గుంత తవ్వి పూడ్చి వేశారు. కుక్కలను పట్టుకుని ఆపరేషన్ కోసం తీసుకెళ్లినా, వాటిని తిరిగి మహవీర్ ఆస్పత్రి దగ్గర వదిలి వేయడం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

దొంగ రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితున్ని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 20వ తేదీన ఘట్‌కేసర్ సర్వేనంబర్ 9లోని వ్యవసాయ క్షేత్రంలో గది తాళం పగులగొట్టి స్టీల్‌వైర్ కట్టలు, వ్యవసాయ పనిముట్లు, సర్వీస్‌వైర్, స్విచ్ బోర్డులను అపహరించుకెళ్లగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు ఘట్‌కేసర్‌లో అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారించగా ఘట్‌కేసర్‌కు చెందిన సత్తి అలియాస్ మంగళ్‌సత్తి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. శనివారం సాయంత్రం నిందితున్ని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కులకచర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని మహంతీపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ శనివారం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా బొంరాస్‌పేట్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్

కొడంగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానమని మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముశ్, కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ దాసప్పయాదవ్, ఓంశాంతి కేంద్రం బ్రహ్మకుమారీస్ పరిమళ అన్నారు. స్థానిక ఓం శాంతి కేంద్రంలో శనివారం విశ్వబంధుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ పరిమళ ఆధ్వర్యంలో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఓంశాంతి బ్రహ్మకుమారీస్ పరిమళ మాట్లాడుతూ అన్నీ ఓం శాంతి భవనాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటుతో రికార్డు స్థాయిలో రక్తాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలతో గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ రెడ్ క్రాస్‌సొసైటీ అధికారి శ్రీకర్, ఇన్‌చార్జి మధుసూదన్, అమ్మనాన్న ఫౌండేషన్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.